కథానిక

# నారి : నారీమతల్లి

జయంతి కామేశ్వరి

"నాకీ వూళ్లో పెద్దదిక్కు మీరేకదా పిన్నిగారూ! కనుక తప్పకుండా వచ్చి రేపు వాయినం అందుకోవాలి మీరు" అంటూ కుంకుమ బరిణె అందించింది శాంత. మాణిక్యమ్మ కుంకుమ పెట్టుకొని, ఆ వేళ్లు మంగసూత్రానికి రాసుకుంటూ "దానికేమమ్మా! ఇంతగా చెప్పాలా? ఇంటి పక్కన వుండి ఈమాత్రం చెయ్యలేనూ? అందులో యిది ఆఖరి మంగళవారం. శ్రావణమాసం తిరిగి యేడాదికిగాని రాదు. శ్రద్ధగా నోము నోచుకో, నీ కడుపు చల్లగా" అని దీవించింది. శాంత వెళ్ళిపోతూ, అదే హాలులో ఓ మూల పుస్తకం చేతిలో పట్టుకుని తనవైపే చూస్తున్న సుజాతతో, "నువ్వు కూడా రావాలి సుమా" అంది. సుజాత కుంకుమ తీసుకుని, వూదేసి బొట్టు పెట్టుకున్నట్లు నటిస్తూ మొహం పుస్తకంలో దూర్చేసుకుంది.

మరునాడు శాంత సలక్షణంగా నోము నోచుకుంది. ఆమె పిలిచిన ముత్తైదువులందరూ సాయంకాలం వచ్చేరు. సుజాత కూడా, తన కాలేజీ స్నేహితులొక యిద్దరిని వెంటబెట్టుకుని వచ్చింది. శాంత పేరంటాళ్ళ కాళ్ళకు పసుపూ, పారాణీ రాసింది. సుజాత బృందం కాళ్లు చీరలోపలే దాచుకుని తమలో తాము నవ్వుకున్నారు. శాంత పేరంటాళ్ళకు మంచి గంధమూ, తాంబూలమూ యిచ్చింది. వెండి పళ్ళెంలో శనగలూ, కొబ్బరి ...క్కలూ, చలిమిడీ పెట్టి ఒక్కొక్కరికీ ... పంచుకొస్తోంది. ఈ పంపకం చూసి సుజాత మిత్రురాండ్రు ఒక్కసారి ఫక్కుమన్నారు. అంతలో ఒకామె, "ఇదేమిటమ్మాయ్, అలా నవ్వకూడదు" అంది.

"చాల్లే చెప్పవొచ్చావ్" అంది ఆ అమ్మాయి. మళ్ళీ సుజాతా వాళ్ళూ గొల్లుమన్నారు. అందులో ఒకామె, "ఎందుకల్లా గోలచేస్తారు? తప్పు కాదూ?" అంది.

"అవును. తప్పు మాదే. మీ మూఢనమ్మకాల చుట్టూ మేం చేరడం తప్పే. రండి పోదాం!" అంటూ లేచింది సుజాత. శాంత సుజాతవద్దకు వెళ్ళి "ఒక్క నిముషం వుండి తాంబూలం తీసుకు వెళ్ళండి" అంది. సుజాత కోపంతో "చాల్లే, ఇలా అవమానం చేసేందుకా పిలిచేవు! చేసిన సత్కారానికి సంతోషించేము" అంటూ దారి తీసింది. శాంత మనస్సు చివుక్కుమంది. మిగతావాళ్ళకు వాయినం యిచ్చి పంపించేక ఆమె దేవుని పటం ముందు కూర్చుని, చాలాసేపు ప్రార్థన చేసుకుంది. సుజాత బృందం వాయినాలు తీసుకు వెళ్ళలేదని చాలా కించపొందింది. ఇదేమీ అశుభ సూచకం కాదు గదా అని చాలా భయపడింది. పోనీ వెళ్ళి సుజాతకి క్షమాపణ చెప్పుకుందామా అనుకుంది. కాని ఏమని కోరడం? ఇంతలో పిల్లలు ముగ్గురూ స్కూలునుంచి వచ్చేరు.

ఆ సాయంత్రం రంగారావు ఆఫీసునుంచి వచ్చీ రావడంతోనే భార్యలో విషాదబీజాలు చూడగలిగేడు. మామూలుగా భర్తకు నవ్వుతూ ఎదురై క్షణాలలో టిఫిను, కాఫీ తెచ్చే శాంత ఏదో పారవేసుకున్నట్లు ఆనాడు ఇల్లంతా వెర్రిగా తిరుగుతోంది. జోళ్లు విప్పుకుని పడకకుర్చీలో వాలి పేపరు చూస్తున్న రంగారావు తొడమీద చేరి చంటివాడు, "నాన్నా! అమ్మ ఏడుస్తోంది" అన్నాడు.

రంగారావు "ఛా! వుత్తది" అన్నాడు.

"అవును. అన్నయ్య నడుగు కావలిస్తే" అంటూ వాడు పరుగెత్తుకుపోయాడు. శాంత బల్లమీద కాఫీ పెట్టి వెళ్ళిపోబోతే రంగారావు అడ్డంవచ్చి సంగతి చెప్పేదాకా కాఫీ తాగనని ప్రతిజ్ఞ చేసేడు. ముందు తాగితే చెబుతానని ఆమె ప్రతిజ్ఞ చేసింది. ఆఖరికి అతడు కాఫీ తాగడమూ, ఆమె విషయం చెప్పడమూ ఒకేసారి జరిగేయి-అంతా విని రంగారావు నవ్వుతూ "ఇంతమాత్రానికే ఇంత ఆలోచనా! చూడు శాంతా! లోకంలో అనేక

న్నాయి. కొత్త ప్రణయంలో కూడా సంసారం కొరకరాని కొయ్యగా మారడంతో సుజాత దిగాలు పడిపోతూంది. భర్త తెచ్చే వంద రూపాయలూ అర్థ నెలలోనే మాయమవుతున్నాయి. వెనకటి ఆలోచనలు, ఆశలు ఆవిరిగా మారడం తలుచుకొని సుజాత మధ్యమధ్య కంట తడిపెట్టు కుంటుంది. అయినా చదువుకున్నాననే అహంభావం పూర్తిగా ఆమెలో అంతరించలేదు. ఇంకేదైనా పెద్ద ఉద్యోగానికి ప్రయత్నించమని భర్తను ప్రోత్సహించింది. పాపం, విశ్వపతి కూడా ఎంతో చింతించేడు. తనకన్న ఓ మెట్టు ఎక్కువ చదువుకున్న భార్యను సుఖపెట్టలేక పోతున్నాననే అశాంతి అతన్ని క్రుంగతీస్తోంది. ఏవిధంగానైనా డబ్బు సంపాదించాలని నిశ్చయించుకున్నాడు. కనబడిన లాటరీలకు, పజిల్సుకు కడుతున్నాడు. కాని, ఒక్కటీ తగలడంలేదు. ఆఖరికోనాడు తెగించి గుర్రపు పందేలకువెళ్ళి పది రూపాయలు కాసేడు. దెబ్బకి వంద వూడిపడ్డవి. ఆ నాడు సుజాత ఆనందానికి మేరలేదు. "మన అదృష్టం పైకివచ్చింది" . మరుసటివారం విశ్వపతి ఆఫీసు సొమ్ములోంచి అయిదు వందలు చేత బుచ్చుకొన్నాడు. తిన్నగా టాక్సీ ఎక్కి రేసుకోర్సుకు దారితీసేడు. వెనకటి రేటు ప్రకారం అయిదు వందలకు అయిదు వేలు ఆదాయం భావించుకున్నాడు. తడబడుతున్న గుండెతో, తేలిపోతున్న కాళ్ళతో ఆ సొమ్ము ఒకేసారి కాసేడు. ఆఖరికి అయిదు రూకలు కూడా రాలలేదు.

భర్త ధనరాసులతో వస్తాడని ఊహించిన సుజాత సాయంత్రం అతని చిన్నెలు చూడగానే ఏమయిందో గ్రహించింది. అతడు చంటివానిలా వలవలా యేడ్చేడు.

"ఈ తప్పంతా నాది. ఈ ఆశ పురికొల్పిన దానిని నేను" అని సుజాత వాపోయింది.

"రేపు సొమ్ము జమకట్టకపోతే ఉద్యోగానికి నీళ్లు తోడుతాడు మేనేజరు" అని వాపోతున్నాడు విశ్వపతి. సుజాత కూడా దిగాలుపడింది. అయిదు వందలు కావాలి. తండ్రివద్దకు పోదామనుకొంది. కాని, పాపం, ఆయన ఏమియ్యగలడని వూరుకొంది. ఇంతలో ఇంటిబయట కారు ఆగిన శబ్దమయింది. ఎవరో 'సుజాతమ్మా' అంటున్నారు వీధిలో. సుజాత తలుపు తీసింది. శాంత కారువద్ద నిలబడివుంది. సుజాతని చూసి లోనికి వచ్చింది.

"నీ ఎడ్రసు మీ అమ్మగారినుండి తెలుసుకున్నానిప్పుడే. రేపు శ్రావణ మంగళవారం గదా! మా యింటికి రావాలని చెబుదామని వచ్చేను" అని కుంకుమ బరిణె అందిచ్చింది. శాంత చేతి గాజుల బంగారు తళతళలు సుజాతలో ఒక ఆశాజ్యోతిని నెలకొల్పేయి. కష్టసముద్రము నుండి కాపాడుటకు వచ్చిన దేవదూతలా శాంత ఆ క్షణాన కనిపించింది. సుజాత ఆమె కాళ్ళు పట్టుకుని "నన్ను క్షమించానంటేనే కాని, రేపు పేరంటానికి రాను. నేను అపరాధిని అక్కయ్యగారూ!" అని వాపోయింది. శాంత ఆమెను కౌగలించుకొని "ఇదేమిటి సుజాతా! పాపం నువ్వు చేసిన తప్పేమిటి? కుర్రతనపు చేష్టలు పెద్దయ్యేక తడుము



కుంటామా?" అంది. తరువాత శాంత ఇంటి ఎడ్రసు రాసి యిచ్చింది. వెళ్ళిపోతానన్న శాంతను సుజాత "ఒక్కమాట" అని లోనికి పిలిచింది. విశ్వపతి వాళ్ళిద్దరూ ఏమి మాట్లాడుకున్నారో ఊహించుకుంటూ సావిట్లో పచారు చేస్తున్నాడు. కాస్సేపయ్యాక శాంత నవ్వుతూ బయటకు వచ్చి "రేపు తప్పకుండా రావాలిసుమా, మీ అమ్మగారుకూడా వస్తారు" అంటూ కారులో వెళ్ళిపోయింది.

ఆ మరునాడు శాంత యిల్లు ముత్తైదువులతో కలకలలాడింది. ఆ సౌభాగ్యపు సొంపులు చూసి సుజాత తన గతించిన చరిత్రలోని పీడకలలకు సిగ్గుపడింది. అందరూ వెళ్ళిపోయేక మాణిక్యమ్మా, సుజాతా, శాంతా కూర్చుని చాలాసేపు మాట్లాడుకున్నారు. సుజాత శాంత మంచితనానికి ఆశ్చర్యపడింది. భర్త నెలకి ఎనిమిదివందలు తెస్తూన్నా, కారూ, పెద్ద యిల్లూ వున్నా, ఆమెలో ఏమార్పూ రాలేదు. నానాటికీ యింకా చిన్నపిల్లలా బంగారు పాపలా మెరిసిపోతోంది. ఆమె నోటినిండా మాటా, కంటినిండా ప్రేమా చూపి సుజాతను వశీకరణం చేసుకుందా అనిపిస్తోంది. నిజానికి శాశ్వతంగా ఆ యింట్లో వుంచుకుంటే శాంతతో వుండాలనిపిస్తోంది సుజాతకు.

ఇంతలో బయట సావిట్లోంచి "శాంతా! శాంతా!" అని రంగారావు పిలుస్తున్నాడు. శాంత లేచి వెళ్ళింది. మాణిక్యమ్మగారూ, సుజాతా శాంత మంచితనాన్ని మెచ్చుకుంటూ మాట్లాడుకుంటున్నారు. ఇంతలో బయట రంగారావు మాటలు గట్టిగా వినిపించడంవల్ల నిశ్శబ్దంగా వుండి వింటున్నారు.

"శాంతా! మన వజ్రాలహారం—అల్మారాలో వుందా చూడూ?"

"ఏమంత ఖంగారు పడుతున్నారు?"

"ముందు చూడు. ఈ వేళ ఒకాయన అల్లాంటిదే మా బ్యాంకులో పెట్టి ఐదువందలు అప్పు తీసుకు వెళ్ళేడు. ఆయన వెళ్ళిపోయేక అనుమానం వచ్చింది నాకు అది మనది కాదుగదా అని." శాంత నవ్వుతూ "అది మనదేనండీ" అంది. రంగారావు "నవ్వకు శాంతా! ముందుచూడు" అన్నాడు.

"చూడడ మెందుకు? మా చెల్లెలి సంసారం అభాసు కాకుండా కాపాడడానికి నేనే యిచ్చేను. మన హారం తాకట్టు పెట్టుకొని కష్టం గడుపుకో మన్నాను" అంది శాంత. రంగారావు ఆశ్చర్యపడుతూ, "మీ చెల్లెలిక్కడెక్కడ వుంది-కాశీలో వుండగా" అన్నాడు.

"ఇక్కడ ఇంకో చెల్లెలువుంది. అదిగో, ఆ గదిలోవుంది చూడండి" అంది శాంత.

రంగారావుకేమీ పాలుపోవడం లేదు. శాంత తనను పరిహాసం చేస్తోందా అనిపించింది. మళ్ళీ ఆమె "నిజమే, అగదిలోవుంది మా చెల్లెలు చూడండి ఊఁ. ఊఁ." అంది. రంగారావు గుమ్మం తెర తప్పించి తొంగిచూసేడు. లోపల మాణిక్యమ్మా సుజాతా వున్నారు- రంగారావు మళ్ళీ సావిట్లోకివచ్చి "అయితే ఆయన సుజాత భర్తగారా?" అన్నాడు. "అవును వాళ్ళ కష్టంచూసి జాలివేసి మన హారం నేనే యిచ్చేను. మీకేమన్నా కోపంగా వుందా?" అంది శాంత. రంగారావు చిరునవ్వుతో యిలా అన్నాడు,

"నాకెందుకు కోపం శాంతా! ఒక సంసారంలో మనమిద్దరం సమభాగస్వాములం. ఒక శరీ రెండు అవయవాలమనుకో. ఒక చెయ్యి ఎవరికేనా ఏదైనా యిస్తూంటే రెండోచెయ్యి అడ్డు పెడుతుందా? అందులోనూ ఒక సంసారపుగుట్టు దాచడానికి అది అనుకూలపడితే అంతేచాలు"—

లోపల మాణిక్యమ్మా, సుజాతా ఆ అపురూప దాంపత్యానికి ముగ్ధులవుతున్నారు. రంగారావు లోనికివచ్చి మాణిక్యమ్మకి నమస్కారంచేసి, యోగక్షేమం ప్రశ్నించేడు. సుజాతవైపు తిరిగి, "ఏమిటి విశేషాలు! మీ ఆయన్ని తీసుకురాలేదే" అన్నాడు. శాంత అడ్డంవచ్చి "మీరు పిలిచేరా యేమిటి? మా చెల్లెలిని నేను పిలిచేను. ఇదిగో వచ్చింది. మీ తమ్ముణ్ణి తీసుకువచ్చే డ్యూటీ మీది" అంది.

"అవునవును. ఏది సుజాతా మీ ఇంటి ఎడ్రసు ఇప్పుడే తీసుకు వస్తాను. ఈరాత్రికి అందరమూ కలిసి భోజనం చెయ్యాలి" అన్నాడు రంగారావు. "ఎడ్రసెందుకు? డ్రైవరుకి తెలుసు వాళ్ళయిల్లు." అంది శాంత. రంగారావు ఒక్క గంతులో వెళ్ళిపోయాడు విశ్వపతి కోసం. సుజాత మాటలకందని అనురాగావేశంతో శాంతని కౌగలించుకుంది. ★